క్లుప్తంగా

నాణ్యతతో నిర్మాణాలు చేపట్టాలి



ఆర్బీకే పనులను పరిశీలిస్తున్న ఈఈ రామకృష్ణారెడ్డి

పాములపాడు: ప్రభుత్వ భవన నిర్మాణాలు నాణ్యతతో చేపట్టాలని పంచాయతీ రాజ్ ఈఈ రామకృష్ణారెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని తుమ్మలూరు, జూటూరు, యర్రగూడూరు గ్రామాల్లోని ఆర్బీకేలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు చివరి నాటికి నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. మద్దూరు, వానాల గ్రామాల్లో నిర్మాణాల్లో ఉన్న భవనాల గురించి కాంట్రాక్టర్లను పిలిపించి మాట్లాడారు. ఆయన వెంట డీఈ ధనిబాబు, జేఈ రాఘవేంద్రప్రసాద్, పంచాయతీ కార్యదర్శి పుల్లయ్య, సర్పంచు వరప్రసాద్ తదితరులు ఉన్నారు.

తహసీల్దార్‌కు ఫిర్యాదు



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న ముస్లింలు

జూపాడుబంగ్లా: శ్మశాన వాటిక స్థల వివాదంపై పారుమంచాల గ్రామానికి చెందిన ముస్లింలు కలిముల్లా, రసూల్, వలిబాషా, ఉస్మాన్‌బాషా, అక్రం, నన్నెసాహెబ్, అన్వర్‌బాషా శుక్రవారం తహసీల్దార్ పుల్లయ్య యాదవ్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామ సమీపంలోని ఇసుక వాగు వద్ద ఉన్న ముస్లింల శ్మశానవాటిక స్థలం గతంలో తనదేనని, పైపొలాలకు శ్మశాన వాటిక లో నుంచి రస్తా ఇవ్వాలని గ్రామానికి చెందిన కరణం శేషయ్య దౌర్జన్యం చేస్తున్నాడని, ఇవ్వకపోతే అంతు చూస్తానని బెదిరిస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు.

వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలి

నందికొట్కూరు రూరల్: వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలని వీఆర్‌ఏల సంఘం మండల అధ్యక్షుడు మహేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన వీఆర్‌ఏల రిలే దీక్షల్లో ఆయన మాట్లాడుతూ వీఆర్‌ఏలకు పేస్కేల్ అమలు చేయాలన్నారు. 60 ఏళ్లు పైబడిన ప్రతి వీఆర్‌ఏల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలన్నారు. దీక్షల్లో వీఆర్‌ఏలు రమణ, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సురక్ష సదస్సును సద్వినియోగం చేసుకోవాలి

పాములపాడు: జగనన్న సురక్ష సదస్సును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ గోపీకృష్ణ సూచించారు. శుక్రవారం మండలంలోని జూటూరు2(తుమ్మలూరు) గ్రామాన్ని సందర్శించారు. వర్షం కురుస్తున్నందున ప్రజలకు ఇబ్బంది లేకుండా కార్యక్రమం నిర్వహించే ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆయన వెంట ఈఓపీఆర్డీ శ్రీనివాసులు నాయుడు, పంచాయతీ కార్యదర్శి పుల్లయ్య ఉన్నారు.

కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు

నందికొట్కూరు: కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు భాస్కర్, విజయ్, బాసిత్ కోరారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట కాంట్రాక్టు కార్మికులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. పలు డిమాండ్ల సాధనకు ఈ నెల 27న మున్సిపల్ కార్యాలయం ముట్టడిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు నాగేశ్వరరావు, చెన్నయ్య, అబ్రహం, సూర్యుడు, సామేలు, రంగస్వామి, మేరమ్మ, లలితమ్మ, కృపమ్మ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

పగిడ్యాల: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి మోహన్ ప్రజలకు సూచించారు. శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆయన మాట్లాడుతూ వర్షాల కారణంగా తాగు నీరు కలుషితమయ్యే ప్రమాదం ఉందన్నారు. అందువల్ల ప్రతి ఒక్కరూ కాచి, చల్లార్చి, వడబోసుకుని తాగాలన్నారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ దోమతెరలు వాడాలన్నారు.

భక్తులకు విస్తృత సౌకర్యాలు కల్పిస్తాం

● శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి



టీడీఎస్ వారి వాటర్ ప్లాంట్‌లను ప్రారంభించిన ఎమ్మెల్యే, చైర్మన్, ఈఓ, సభ్యులు



కొత్తపేట ఏరియాలో నూతన రోడ్లకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే, చైర్మన్

శ్రీశైలంటెంపుల్: మల్లన్న భక్తులకు విస్తృత సౌకర్యాలు కల్పిస్తామని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి తెలిపారు. శుక్రవారం శ్రీశైల క్షేత్రంలో టూరిస్టు బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన నందీశ్వర ధర్మకాటా శిలాఫలకాన్ని శ్రీశైల దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి, ఈఓ లవన్నతో కలిసి ఆయన విష్కరించారు. అనంతరం శ్రీశైలంలోని కొత్తపేట, శ్రీగిరి కాలనీ వద్ద రూ.55లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. అలాగే ఆయా కాలనీలలో అన్ని రోడ్లను సుమారు రూ.1.50 కోట్లతో నిర్మించేందుకు భూమిపూజ చేశారు. అనంతరం టీడీఎస్ ల్యాబొరేటరీ లిమిటెడ్ కంపెనీ వారిచే క్షేత్ర పరిధిలో 7 చోట్ల ఏర్పాటు చేసిన ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్లను ప్రారంభించారు. అనంతరం సున్నిపెంటలో దేవస్థాన ఉద్యోగుల కోసం ఏర్పాటు చేస్తున్న స్టాఫ్ క్వార్టర్స్ పనులకు భూమిపూజ చేశారు. మినరల్ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేసిన టీడీఎస్ ల్యాబొరేటరీస్ యాజమాన్యానికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు మేరాజోత్ హనుమంత్ నాయక్, మధుసూదన్‌రెడ్డి, డాక్టర్ కనకదుర్గ, సుజాత, నరసింహారెడ్డి, ధర్మరాజు, దేవస్థాన ఈఈ వి.రామకృష్ణ, ఏఈ రాజేష్, సీతారమేష్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి ఎంఏ.రజాక్, రఫీ, టీడీఎస్ ల్యాబొరేటరీస్ ప్రతినిధులు వల్లూరి వెంకటరాజు, చిట్టిపోలు శ్రీనివాస్, వంశీకృష్ణ పాల్గొన్నారు.

దాతలకు ప్రత్యేక గుర్తింపు కల్పిస్తాం

శ్రీశైల దేవస్థానానికి విరాళాలు అందించే దాతలకు ప్రత్యేక గుర్తింపు కల్పించి వారికి తగిన గౌరవ మర్యాదలతో స్వామిఅమ్మవార్ల దర్శనం కల్పిస్తామని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి తెలిపారు. భక్తుల ప్రవేశ ద్వారాలను దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. క్యూలైన్ల వద్ద ఇనుప ఫెన్సింగ్ ఉండడంపై అసహనం వ్యక్తం చేశారు. ఆర్జితసేవాకర్తలకు, గర్భాలయ అభిషేకం, సామూహిక అభిషేకం, వీఐపీ బ్రేక్ దర్శనం సేవాకర్తలకు ప్రత్యేక ప్రవేశ ద్వారాలను ఏర్పాటు చేసి సేవాకర్తలను గౌరవించాలని అధికారులను ఆదేశించారు. తిరుమల తరహాలో శ్రీశైల క్షేత్ర అభివృద్ధి జరుగుతుందన్నారు. సేవాకర్తల ప్రవేశ ద్వారాల వద్ద ఇత్తడి, రాగి గ్రిల్స్ ఏర్పాటు చేస్తామన్నారు.

మల్లన్నను దర్శించుకున్న ఎమ్మెల్యే శిల్పా

శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఆలయ రాజగోపురం వద్ద దేవస్థాన ఈఓ ఎస్.లవన్న, అర్చక స్వాములు, అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజలనంతరం అమ్మవారి ఆలయం వద్ద ఆశీర్వచన మండపంలో ఎమ్మెల్యేకు వేదపండితులు వేదమంత్రాలు పలుకగా, అర్చకులు ఆశీర్వచనాలు అందించారు. అధికారులు స్వామివారి శేషవస్త్రాన్ని, లడ్డూ ప్రసాదాలను అందించి సత్కరించారు.

ఎమ్మెల్యే శిల్పాను సన్మానించిన చైర్మన్

ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎథిక్స్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన సందర్భాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే శిల్పాను శ్రీశైల దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి సన్మానించారు. అతిథిగృహంలో ఎమ్మెల్యే శిల్పాను కలిసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

మాతా శిశు సంరక్షణే ధ్యేయం



మొక్కకు నీరు పోస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ ఆసియా మారుఫ్

ఆత్మకూరు: వైద్యసిబ్బంది మాతా శిశు సంరక్షణే ధ్యేయంగా విధులు నిర్వహించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియా మారుఫ్ సూచించారు. శుక్రవారం ప్రభుత్వ వైద్యశాలలో కేర్ కంపానియన్ కార్యక్రమంలో భాగంగా మొక్కలకు నీరు పోశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లీబిడ్డల సంక్షేమానికి ప్రభుత్వం వైద్యశాలల్లో కేర్ కంపానియన్ కార్యక్రమం ఏర్పాటు చేసిందన్నారు. తల్లి ప్రసవించిన అనంతరం బిడ్డ సంరక్షణతో పాటు తల్లికి పౌష్టికాహారం అందించడం, పుట్టిన బిడ్డకు టీకాలు, ఇతర వైద్య సేవలందించడం వైద్య సిబ్బంది కర్తవ్యమన్నారు. ఇళ్ల వద్ద బాలింతలు, పురిటి బిడ్డకు ఏవైనా సమస్యలు ఉంటే నిర్లక్ష్యం చేయకుండా వైద్య సేవలందించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు వెంకటరమణ, ప్రసన్నలక్ష్మి, వసంతకుమారి, రవికుమార్, సరోజ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

‘జగనన్న సురక్ష’ పేదలకు రక్ష



మహిళకు సర్టిఫికెట్ అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి

నందికొట్కూరు: జగనన్న సురక్ష సదస్సులు పేదలకు ఎంతో ఉపయోగపడుతున్నాయని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం 13వ సచివాలయంలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష సదస్సులో ఆయన పాల్గొని పలువురికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ గతంలో సర్టిఫికెట్లు పొందేందుకు ప్రజలు అనేక ఇబ్బందులు పడేవారన్నారు. సీఎం వైఎస్ జగనన్న పాలనలో ఇంటికే అన్ని సేవలను అందిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కిషోర్, కౌన్సిలర్లు అశోక్, రవూఫ్, మున్సిపల్ ఆర్.ఐ విక్రమ్, సచివాలయాల జేసీఎస్ కన్వీనర్ అబుబకర్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న డీఎం మహేంద్రుడు, ఆర్టీసీ సిబ్బంది

ఆత్మకూరు: రాష్ట్రంలో ఏపీఎస్ ఆర్టీసీ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సేవలు మరువలేమని డీఎం మహేంద్రుడు, ఆర్టీసీ వైఎస్సార్ యూనియన్ రీజినల్ అధ్యక్షుడు నాగేంద్రాచారి, ఆర్టీసీ సీఐ కోటయ్య అన్నారు. పట్టణంలోని ఏపీఎస్ ఆర్టీసీ డిపో ఆవరణంలో శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి గతంలో ఆర్టీసీకి ఎన్నో రాయితీలు ఇచ్చారని, ప్రస్తుతం ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా తండ్రి బాటలో పయనిస్తూ ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేసి తమ చిరకాల కోరికను తీర్చారన్నారు.

పారిశుధ్య పనులు



కృష్ణారావుపేటలో జేసీబీతో కాలువ తీస్తున్న దృశ్యం

పాములపాడు: మండలంలోని కృష్ణారావుపేట గ్రామంలో శుక్రవారం పారిశుధ్య పనులు చేపట్టారు. ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా గ్రామంలోని ప్రధాన రహదారిలో వర్షపు నీరు నిలిచి ప్రజలకు రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. దీంతో వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు రామలింగేశ్వరరెడ్డి సొంత నిధులతో జేసీబీని పిలిపించి వర్షపు నీరు వెళ్లేలా కాలువ తీయించారు. పనులను సర్పంచు వరప్రసాద్,పంచాయతీ కార్యదర్శి పుల్లయ్య, పార్టీ నాయకులు వెంకటేశ్వరరెడ్డి, రహీంబాషా పర్యవేక్షించారు.

వెలుగోడు: పట్టణంలోని సీపీ నగర్ నుంచి పొట్టి శ్రీరాములు సెంటర్ వరకు తెలుగు గంగ పంట కాలువ నీరు వచ్చి చేరుతుండటంతో మేజర్ పంచాయతీ సిబ్బంది శుక్రవారం జేసీబీతో పూడిక తీయించి, ట్రాక్టర్లతో చదును చేయించే పనులకు శ్రీకారం చుట్టారు. నీరు నిల్వ ఉండకుండా బయటకు వెళ్లేందుకు చర్యలు తీసుకుంటున్నారు. పనులను ఎంపీపీ లాలం రమేష్, సర్పంచ్ జయపాల్, వైఎస్‌ఆర్‌సీపీ పట్టణ అధ్యక్షుడు ఇలియాస్ ఖాన్, మండల ప్రధాన కార్యదర్శి కాసారపు రామోహన్ రెడ్డి, వార్డు మెంబర్ పిల్లల మమ్మద్ హుస్సేన్, మల్లికార్జున, లాలం ప్రవీణ్, నారాయణ, మదీనా కోళ్ల ఫారం షఫీ అహ్మద్ పరిశీలించారు.

దుస్తుల పంపిణీ



ఆర్యవైశ్య వాసవీ సిబ్బందికి దుస్తులు పంపిణీ చేస్తున్న మాజీ మంత్రి సిద్దారాఘవరావు

శ్రీశైలం: క్షేత్రపరిధిలోని వాసవీ సత్రంలో పని చేస్తున్న పేద ఆర్యవైశ్య సిబ్బందికి ఆర్యవైశ్య అఫీసియల్ ప్రొఫెషనల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా దుస్తులు పంపిణీ చేశారు. ఆఓపా అసోసియేషన్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు నిర్మల, చిన్న సుబ్బారావు దంపతులు చేపట్టిన ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి సిద్దారాఘవరావు దంపతులు, వాసవీసత్రం సముదాయం అధ్యక్షులు దేవకి వెంకటేశ్వర్లు, సత్రం గౌరవ అధ్యక్షులు సిద్దా నాగేశ్వరరావు హాజరై దుస్తులను అందజేశారు. అంతకుముందు సత్ర ప్రాంగణంలోని వాసవీ మాతకు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆఓపా మండల సభ్యులు, వాసవీసత్ర కమిటీ సభ్యులు కొండలయ్య, అయితా మార్కండేయులు, చిన్న సుబ్బయ్య, కిషోర్, గణపతి, తదితరులు పాల్గొన్నారు.

అర్ధ చాతుర్మాస పూజల్లో మాజీ మంత్రి

క్షేత్ర పరిధిలోని వాసవీసత్రంలో అర్ధచాతుర్మాస దీక్షను స్వీకరించిన తెనాలి బాలస్వామి (ప్రజ్ఞానందసరస్వతీస్వామి) చేస్తున్న అర్ధ చాతుర్మాస దీక్షా పూజల్లో మాజీ మంత్రి సిద్దా రాఘవరావు దంపతులు పాల్గొన్నారు. దీక్షా క్రతువుల్లో భాగంగా స్వామీజీకి అవసరమైన ఫలపుష్పాదులను సమర్పించగా ఆయన పీఠం తరపున ఆశీర్వాదాలను అందజేస్తూ జ్ఞాపికతో సత్కరించారు.

మహానందీశ్వరుడికి పల్లకీసేవ

మహానంది: మహానందిలో కొలువైన కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్ల దంపతులకు శుక్రవారం పల్లకీ సేవ నిర్వహించారు. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉత్సవ మూర్తులను అలంకరించి ఆలయ ప్రాకారాల్లో పల్లకీ ఉత్సవం నిర్వహించారు.

నేడు జగనన్న సురక్ష

వెలుగోడు: పట్టణంలోని 3వ సచివాలయం పరిధిలో శనివారం జగనన్న సురక్ష సదస్సు నిర్వహించనున్నారు. శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా పాల్గొని లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేయనున్నారు.

మహానంది: మహానంది మండల గోపవరం, బండిఆత్మకూరు మండలం జి.లింగాపురం గ్రామాల్లో శనివారం నిర్వహించనున్న జగనన్న సురక్ష సదస్సుల్లో శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి పాల్గొంటారు.

మిడుతూరు: వీపనగండ్ల, చింతలపల్లి గ్రామాల్లో శనివారం జగనన్న సురక్ష సదస్సులు నిర్వహించనున్నారు.

జూపాడుబంగ్లా: తరిగోపుల గ్రామంలో శనివారం సర్పంచ్ లక్ష్మమ్మ అధ్యక్షతన జగనన్న సురక్ష సదస్సు నిర్వహించనున్నారు.

పగిడ్యాల: నెహ్రూనగర్ సచివాలయం 2లో శనివారం జగనన్న సురక్ష సదస్సును నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకటరమణ శుక్రవారం తెలిపారు.

అందుబాటులో ఉండాలి

జూపాడుబంగ్లా: సచివాలయ ఉద్యోగులు సకాలంలో విధులకు హాజరై ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపీడీఓ సుబ్రమణ్యశర్మ సూచించారు. శుక్రవారం ఆయన తంగడంచ సచివాలయాన్ని తనిఖీచేశారు. హాజరుపట్టికను పరిశీలించి, సకాలంలో విధులకు హాజరుకాని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి రోజూ మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు స్పందన నిర్వహించాలన్నారు. అనంతరం సాలిడ్‌వేస్టుమేనేజ్‌మెంట్ యూనిట్‌ను పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి విజయ్‌కుమార్ ఉన్నారు.

డాక్టరేట్ ప్రదానం



విజయచంద్రుడు

మహానంది: తిమ్మాపురం గ్రామానికి చెందిన ఔట విజయచంద్రుడుకు శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. వర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ దశరథరామయ్య పర్యవేక్షణలో ఆర్థిక శాస్త్ర విభాగంలో ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపాలిటీల ఆదాయ వనరులు మరియు వ్యయాలపై చేసిన పరిశోధనకు గానూ ఈ నెల 17న గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల డాక్టరేట్ అందుకున్నట్లు విజయచంద్రుడు శుక్రవారం తెలిపారు.

ప్రగతి బాటన పల్లెలు



ముస్లిం మైనార్టీ మహిళలకు మంజూరైన రైస్ కార్డు అందజేస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

● శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

శ్రీశైలంప్రాజెక్ట్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హయాంలో పల్లెలు ప్రగతిబాటన పట్టాయని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. మండలంలోని సున్నిపెంట గ్రామ సచివాలయం -3లో శుక్రవారం నిర్వహించిన జగనన్న సురక్ష సదస్సులో ఆయన పలువురు లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి ఏ అవసరమొచ్చినా ముఖ్యమంత్రి పరిష్కరిస్తున్నారన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతో పాలననే ప్రజల ముంగిటకు తెచ్చారన్నారు. స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమాల్లో పరిష్కారానికి నోచుకోని సమస్యలను సైతం జగనన్న సురక్ష సదస్సుల్లో పరిష్కరించాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ప్రజాదరణను చూసి ఓర్వలేక తెలుగుదేశం పార్టీ నాయకుడు చంద్రబాబు నాయుడు, జనసేన పార్టీ నాయకుడు పవన్‌కల్యాణ్ వలంటీర్ వ్యవస్థపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. ప్రజలు గమనించి వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ జి.పరమేశ్వరి, ఎంపీడీఓ మోహన్‌కుమార్, తహసీల్దార్ రాజేంద్రసింగ్, పంచాయతీ సెక్రటరీ బాలునాయక్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వట్టి వెంకటరెడ్డి, మైనార్టీ కార్యదర్శి ఎంఏ రజాక్, మండల నాయకులు భరత్‌రెడ్డి, టీఎండీ రఫీ, మహమ్మద్ ఖాసీం, ఆసాది ప్రవీణ్‌దివ్యతేజ, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయ కులు కత్తుల కోటేశ్వరరావు మండల డాక్టర్ రజని, వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నదానం మల్లికార్జున, జిలానీ, ధమయంతి, ప్రభావతి పాల్గొన్నారు.

జలవనరుల శాఖ కేటాయింపులు చెల్లవు

శ్రీశైలం ప్రాజెక్ట్ కాలనీలో ఇరిగేషన్ అధికారులు అనుమతులు లేకుండా లంచాలు తీసుకుంటూ అడ్డగోలుగా ప్రభుత్వ గృహాలు, స్థలాలను కేటాయిస్తున్నారని, అవి చెల్లవని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత మే 11న రాష్ట్ర ప్రభుత్వం జీఓ నంబర్ -40 తీసుకు వచ్చిందని, అప్పటి నుంచి 208.74 ఎకరాల్లో ఉన్న సున్నిపెంట గ్రామం గ్రామ పంచాయతీ పరిధిలోకి వచ్చిందన్నారు. కలెక్టర్ ఆదేశాలతోనే పంచాయతీ రాజ్ శాఖ పర్యవేక్షణలో ఏ నిర్ణయాలైన తీసుకుంటారన్నారు. పాత తేదీలతో కొన్ని కేటాయించినట్లు తమ దృష్టికి వచ్చిందని, అవసరమైతే జలవనరుల శాఖ అధికారులపై క్రిమినల్ చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోమని హెచ్చరించారు.

న్యాయమైన పరిహారానికి కృషి

● ఆర్డీఓ దాసు



రైతుల ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న అధికారులు

కొత్తపల్లి: జాతీయ రాహదారి 167 కె నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు న్యాయమైన పరిహారం అందజేసేందుకు కృషి చేస్తున్నట్లు ఆత్మకూరు ఆర్డీఓ దాసు తెలిపారు. శుక్రవారం తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్ అధ్యక్షతన స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పక్కన ఉన్న వెన్నెల గార్డెన్‌లో రైతుల పొలాలకు సంబంధించిన ధ్రువపత్రాలను పరిశీలించారు. సిద్దేశ్వరం, ఎర్రమఠం, ముసలిమడుగు, గుమ్మడాపురం, శివపురం, గోకవరం, దుద్యాల గ్రామాల్లోని 560 మంది రైతులకు గానూ 317 మంది పొలాల ధ్రువపత్రాల పరిశీలన పూర్తయింది. ఈసందర్భంగా ఆర్డీఓ దాసు మాట్లాడుతూ మిగతా రైతులు కూడా త్వరగా ధ్రువపత్రాలను సమర్పించాలన్నారు. ఏమైనా అభ్యంతరాలుంటే ధ్రువపత్రాలతో పాటు అర్జీ సమర్పిస్తే వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. రైతుల భూములకు సరైన విలువను ప్రభుత్వమే నిర్ణయిస్తుందన్నారు. కాగా అధికారులు నోటీసులు ఇవ్వకుండా ధ్రువపత్రాలు సేకరించడం తగదని ఎర్రమఠం రైతులు సభను బహిష్కరించారు.



గోమాతకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు



కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

గోవులను సంరక్షించుకోవాలి

జూపాడుబంగ్లా: మానవాళి మనుగడకు ఎంతగానో దోహదపడే గోజాతిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తిరుమల తిరుపతి హిందూ ధర్మప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి మల్లు వెంకటరెడ్డి తెలిపారు. శుక్రవారం పారుమంచాల గ్రామంలోని వేణుగోపాలస్వామి ఆలయం వద్ద గోపూజ, సామూహిక కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మేడా సుబ్రమణ్యం స్వామి, భజన మండలి అధ్యక్షుడు పాలరాముడు, దివాకర్‌రెడ్డి, జనార్దన్ రెడ్డి, శేఖర్‌నాయుడు, చెన్నప్పనాయుడు, శేఖర్, రమణ, పాపయ్య, బాబు, వెంకటస్వామి, మధునాయుడు, పెద్దబాబు, ప్రమీలమ్మ, చిన్నబాబు, రేణుకాదేవి, లక్ష్మీదేవి, పన్నంగి శేఖర్, మహేష్, హరి, మధు, భక్తులు పాల్గొన్నారు.

మణిపూర్ దారుణకాండను నిలువరించండి

శ్రీశైలంప్రాజెక్ట్: మణిపూర్‌లో జరుగుతున్న మానవ హక్కుల ఉల్లంఘనను కేంద్రప్రభుత్వం నిలువరించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వై.ఆశీర్వాదం డిమాండ్ చేశారు. అక్కడ జరుగుతున్న దారుణాలు, లైంగిక దాడులు, హక్కుల ఉల్లంఘన దేశ చరిత్రలో మాయనిమచ్చగా మిగులుతుందన్నారు.

నిబంధనల మేరకే విక్రయించాలి

నందికొట్కూరు: యాసిడ్‌ను నిబంధనల ప్రకారం విక్రయాలు జరపాలని ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం పోలీసు స్టేషన్‌లో యాసిడ్ విక్రయదారులకు, బంగారు దుకాణాదారులకు, కళాశాలల యాజమానులకు డీఎస్పీ కౌన్సిలింగ్ నిర్వహించారు. గోల్డ్ షాపులకు, ల్యాబ్, బ్యాటరీ వర్క్ షాపు యాజమానులకు డీఎస్పీ నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇష్టానుసారంగా యాసిడ్ విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. టౌన్ సీఐ విజయభాస్కర్, ఎస్ఐ ఎన్వీ రమణ తదితరులు ఉన్నారు.

పారుమంచాల మీదుగా నంద్యాలకు బస్సు

జూపాడుబంగ్లా: నందికొట్కూరు ఆర్టీసీ డిపో నుంచి పారుమంచాల మీదుగా నంద్యాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించినట్లు డిపో మేనేజర్ నాగేశ్వరరావు శుక్రవారం తెలిపారు. రద్దీ ఎక్కువైతే బస్సు సర్వీసులు పెంచుతామన్నారు.

పారిశుధ్య పనులకు ప్రాధాన్యత

మహానంది: గ్రామాల్లో పారిశుధ్య పనులకు ప్రాధాన్యత ఇస్తామని వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నియోజకవర్గ సీనియర్ నేత శిల్పా భువనేశ్వరరెడ్డి తెలిపారు. బండిఆత్మకూరు మండలం బి.కోడూరు గ్రామంలోని దూదేకుల కాలనీలో పర్యటించారు. సీసీ రోడ్డు, సచివాలయం పరిధిలో నీరు నిలిచి స్థానికులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట ఎంపీపీ దేరెడ్డి చిన్నసంజీవ రెడ్డి, నాయకులు బారెడ్డి శ్రీనివాసరెడ్డి, ముడిమెల పుల్లారెడ్డి, నాగేంద్ర, గోపాల్ పాల్గొన్నారు.

రస్తా వివాదం.. శవ యాత్ర అడ్డగింత

● వీపనగండ్ల గ్రామంలో ఉద్రిక్తత
● ఇరువర్గాలకు సర్దిచెప్పి దహన సంస్కారాలు పూర్తి చేసిన పోలీసులు



ఒక వర్గం శవ యాత్రను అడ్డుకున్న మరో వర్గం

మిడుతూరు: కరోనా నేర్పిన గుణ పాఠం కొందరికి తలకెక్కలేదు. ఈ క్షణంలో ఇది నాది అనే వ్యక్తులు మరు క్షణమే మట్టిలో కలిసిపోయినదీ మరిచిపోయారు. మనిషిని కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న వారిని ఓదార్చడం వదిలి.. శవ యాత్రను సైతం అడ్డుకుని మానవత్వం మంటగలిసి పోతోందని నిరూపిస్తున్నారు. మండల పరిధిలోని వీపనగండ్ల గ్రామంలో శుక్రవారం ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన రెండు వర్గాల మధ్య నెలకొన్న రస్తా శవ యాత్ర అడ్డుకునే వరకూ వెళ్లింది. దీంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. పోలీసులు రంగప్రవేశం చేసి దహన సంస్కారం పూర్తి చేయించడంతో గ్రామస్తులు ఊపిరిపీల్చుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు.. ఎస్సీ కాలనీలో ఓ వర్గానికి చెందిన చెన్న అనే వృద్ధుడు అనారోగ్యంతో గురువారం సాయంత్రం మృతిచెందాడు. శుక్రవారం ఉదయం దహన సంస్కారాల నిమిత్తం శవ యాత్ర బయలుదేరగా మరో వర్గం వారు తమ కాలనీలో వెళ్లొద్దని అడ్డుకున్నారు. ఈ క్రమంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ విషయం తెలుసుకున్న నందికొట్కూరు పట్టణ సీఐ విజయభాస్కర్, ముచ్చుమర్రి ఎస్ఐ నాగార్జున, మిడుతూరు ఏఎస్ఐ సుబ్బయ్య, బ్రాహ్మణకొట్కూరు ఏఎస్ఐ రఘురామయ్యలతో పాటు పోలీసు సిబ్బంది గ్రామానికి చేరుకున్నారు. సీఐ ఇరువర్గాలతో మాట్లాడారు. సమస్యను స్టేషన్‌లో కూర్చొని పరిష్కరించుకుందామని నచ్చజెప్పి దహన సంస్కారాలు పూర్తి చేయించారు. అంతవరకు గొడవలకు పాల్పడితే చర్యలు తప్పవని ఇరువర్గాలను హెచ్చరించారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా శవ యాత్రను అడ్డుకున్న 22 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మారుతీ శంకర్ తెలిపారు.